సాక్షి శ్రీకాకుళం

మంగళవారం । 29 । ఏప్రిల్ । 2025



గ్రీవెన్స్‌కు 165 వినతులు

కలెక్టర్ గ్రీవెన్స్‌కు 165 వినతులు వచ్చాయి. బాధితులు సమస్యలు ఏకరువు పెట్టారు.

- 8లో





అభినయ కుసుమాలు

సిక్కోలు నృత్యకారులు అంతర్జాతీయ వేదికలు అధిరోహిస్తున్నారు. చప్పట్లను ఇంధనంగా మార్చుకుంటూ అంచెలంచెలుగా ఎదుగుతున్నారు. ముచ్చటైన హావభావాలతో ప్రేక్షకుల మదిని దోచుకుంటున్నారు. నేడు అంతర్జాతీయ నృత్య దినోత్సవం. -ఇచ్ఛాపురం రూరల్

- రాణిస్తున్న సిక్కోలు నాట్యకారులు
- జాతీయ, రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ

నేడు అంతర్జాతీయ నృత్య దినోత్సవం

లారీ డ్రైవర్ కుమార్తె

ఇచ్ఛాపురం పట్టణానికి చెందిన మంగి మాధవరావు లారీ డ్రైవర్. తల్లి దాలమ్మ గృహిణి. వీరి కుమార్తె దివ్య పలు రాష్ట్రాల్లో జాతీయ, రాష్ట్రస్థాయి ప్రదర్శనలు ఇచ్చింది. స్వేచ్ఛా నృత్య తరంగిణి నృత్య శిక్షణాలయంలో నృత్యం నేర్చుకున్న దివ్య గిన్నిస్ రికార్డు అందుకున్న సిలికానాంధ్ర కూచిపూడి ప్రదర్శనలోనూ పాల్గొంది. విజయవాడలో జరిగిన పోటీల్లో మూడు సార్లు గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డు సాధించింది. సుమారు 800 వరకు నృత్య ప్రదర్శనలు ఇచ్చింది.

జాతీయ స్థాయిలో రాణిస్తూ..

బరంపురంలో డిగ్రీ చదువుతున్న మోనాలీదాస్ నృత్య ప్రదర్శనల్లో జాతీయ స్థాయిలో రాణిస్తోంది. మోనాలీ తల్లి మనోజ్ మంజరీ త్రిపాఠీ ఇచ్ఛాపురం మండలం తేలుకుంచి ప్రాథమికోన్నత పాఠశాలలో ఒడియా ఉపాధ్యాయురాలిగా పనిచేస్తుండగా, తండ్రి లక్ష్మణదాస్ ఒడిశాలో ఉపాధ్యాయుడుగా విధులు నిర్వహిస్తున్నారు. తండ్రి వద్దే నృత్యం నేర్చుకున్న మోనాలీ కూచిపూడి, భరతనాట్యం, ఒడిస్సీలో ప్రావీణ్యం సంపాదించింది. పలు చానెళ్లలోనూ ప్రదర్శనలు ఇచ్చింది.



సిరిమువ్వల శృతి

ఇచ్ఛాపురంలోని వెంకటేశ్వర మ్యూజిక్ అండ్ డాన్స్ అకాడమీ వ్యవస్థాపకుడు బలివాడ చిన్న గురుస్వామి, జయలక్ష్మీల గారాలపట్టి శృతి. పదేళ్ల ప్రాయంలోనే నృత్యంలో డిప్లమా కోర్స్, సర్టిఫికెట్ కోర్సులో శిక్షణ పొందింది. పలు దూరదర్శన్ చానెల్స్‌లో ప్రదర్శినలు ఇచ్చిన శృతి బి గ్రేడ్ ఆర్టిస్టుగా ఎంపికైంది. పలు అవార్డులు, రివార్డులతో పాటు పొందిన ప్రశంసలు రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందింది.

న్యూస్‌రీల్

30లోగా రిటర్న్‌లు దాఖలు చేయాలి



రాంబాబు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): జిల్లాలో ఫ్యాక్టరీల చట్టం, 1948 ప్రకారం రిజిస్టరైన రైస్ మిల్లులు, జీడిపిక్కల కర్మాగారాలు, గ్రానైట్ కర్మాగారాలు, స్టోన్ క్రషర్‌లు, షా మిల్లులు (కర్రల మిల్లులు), ఇతర పెద్ద కర్మాగారాలన్నీ ఇంటిగ్రేటెడ్ మాన్యువల్ రిటర్న్‌లను సమర్పించాలని కర్మాగారాల ఉపముఖ్య తనిఖీ అధికారి రాంబాబు కోరారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఏప్రిల్ 30వ తేదీలోగా సింగిల్ డెస్క్ పోర్టల్ ఏపీ ఇండస్ట్రీస్.జీఓవీ.ఇన్‌లో తప్పనిసరిగా సమర్పించాలని కోరారు.

పాలిసెట్‌కు ముమ్మర ఏర్పాట్లు



పరీక్ష నిర్వహణపై ఏర్పాటు చేసిన సమావేశం

ఎచ్చెర్ల క్యాంపస్: పాలిటెక్నిక్ డిప్లమా కోర్సుల్లో ప్రవేశానికి సంబంధించిన పాలిసెట్-2025 నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నట్లు సాంకేతిక విద్యాశాఖ ఆర్‌జేడీ జె.సత్యనారాయణ మూర్తి తెలిపారు. శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో పరీక్ష నిర్వహణపై అధికారులు, ఎగ్జామినర్లతో సోమవారం సమీక్ష నిర్వహించారు. దరఖాస్తు చేసి హాల్ టిక్కెట్లు రాని విద్యార్థులు శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల సహాయ కేంద్రాన్ని సంప్రదిస్తే సమస్య పరిష్కరిస్తామని అన్నారు. పరీక్ష 30వ తేదీన ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ పరీక్షకు నిమిషం ఆలస్యమైనా అనుమతించబోమని చెప్పారు. ఆధార్ జిరాక్స్, రెండు పాస్ పోర్టు సైజ్ ఫొటోలతో విద్యార్థులు పరీక్షకు హాజరు కావాలని అన్నారు. శ్రీకాకుళం, టెక్కలి డివిజన్‌లలోని 39 పరీక్ష కేంద్రాల్లో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. జిల్లా నుంచి 1152 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారని అన్నారు. షెడ్యూల్ మేరకు పరీక్ష నిర్వహణ, ఫలితాలు వెల్లడి, కౌన్సెలింగ్ నిర్వహణ ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో స్థానిక ప్రిన్సిపాల్, జిల్లా ప్రవేశాల ఇన్‌చార్జి బి.జానకి రామయ్య, అధికారులు పాల్గొన్నారు.

నేటి నుంచి నీలమణి దుర్గమ్మ మహోత్సవాలు



విద్యుత్ కాంతులతో అమ్మవారి ఆలయం

పాతపట్నం: ఉత్తరాంధ్ర ఇలవేల్పు పాతపట్నం నీలమణి దుర్గమ్మ ఆలయ సన్నిధిలో మంగళవారం నుంచి 50వ వార్షిక నవరాత్రి మహోత్సవాలు ప్రారంభం కానున్నాయి. తొమ్మిది రోజుల పాటు ఉత్సవాలు నిర్వహిస్తామని ఆలయ కార్యనిర్వహణాధికారి టి.వాసుదేవరావు తెలిపారు. సోమవారం ఆలయాన్ని విద్యుత్‌కాంతులతో అలంకరించారు. తొమ్మిది రోజుల పాటు అమ్మవారి ఆలయంలో హోమాలు, వర్ధినీ కలశ స్థాపన, విఘ్నేశ్వర పూజ, దేవ పుణ్యాహవచనం, కుంకుమ పూజలతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు.

రాలిన మామిడి కాయలు



దేవాది వద్ద రాలిన మామిడి కాయలు

నరసన్నపేట: మండల పరిధిలో సోమవారం సాయంత్రం ఈదురుగాలులతో కూడిన వర్షం కారణంగా రైతులు ఆందోళన చెందారు. పొలాల్లో నువ్వు, పెసర పంటలు ఉన్నాయి. పెసరకు ఇబ్బంది లేకపోయినా నువ్వు పంటకు నష్టం వాటిల్లుతుందని రైతులు అంటున్నారు. అలాగే గాలులకు మామిడి కాయలు పలు చోట్ల రాలాయి. వీఎన్ పురం, యారబాడు, ఉర్లాం, బడ్డవానిపేట చిక్కాలవలస, తెలగవలస, కరగాం తదితర గ్రామాల్లో వరి ధాన్యం వర్షానికి కొంత నష్టం కలుగుతుందని రైతులు అంటున్నారు. అరటి చెట్లకు కొంత వరకూ నష్టం కలిగినట్లు తెలుస్తోంది. నరసన్నపేటలో ఫ్లెక్సీలు గాలికి ఎగిరి పడ్డాయి. మెయిన్ రోడ్డుపై కాంప్లెక్స్ సమీపంలో ఒక ఫ్లెక్సీ గాలికి విద్యుత్ వైర్లపై పడింది. వెంటనే విద్యుత్ అధికారులు అప్రమత్తమై తొలగించారు.

మార్గాలు.. దుర్మార్గాలు

- మెటీరియల్ కాంపోనెంట్ నిధులు దుర్వినియోగం
- నాయకుల పొలాలు, కొబ్బరి తోటలు, రియల్ ఎస్టేట్ వెంచర్లకు సీసీ రోడ్లు
- టీడీపీ నాయకులు చెప్పినట్టుగా వ్యవహరించిన అధికారులు

టీడీపీ నేతల భూములకు ఉపాధి నిధులతో రోడ్లు



సరుబుజ్జిలి మండలం దాకరవలస పంచాయతీలోని సూర్యనారాయణపురం రహదారి ఇది. ఏబీ రోడ్డు నుంచి టీడీపీ నాయకుడు అంబల్ల రాంబాబు పొలాల వరకు రూ.40 లక్షలతో సీసీ రోడ్డు వేసేందుకు మంజూరు చేశారు. ఈ రోడ్డు వేస్తే టీడీపీ నాయకుడికి తప్ప ఎవరికీ ప్రయోజనం ఉండదు. చెరువు గర్భం మీదుగా రోడ్డు ప్రతిపాదించడంతో దిగువ ప్రాంతాలైన నక్కలపేట, పెద వెంకటాపురం, చిన వెంకటాపురం గ్రామాలకు సాగునీటి సమస్య కూడా ఉత్పన్నం కానుంది.



ఆమదాలవలస మండలం కొర్లకోట గ్రామంలో కొత్తగా వేసిన సీసీ రోడ్డిది. ఇక్కడ అప్పటికే మంచి సీసీ రోడ్డు ఉంది. చెక్కు చెదరలేదు. కానీ, మళ్లీ అదే రోడ్డుపై కొత్తగా ఉపాధి హామీ పథకం మెటీరియల్ కాంపోనెంట్ నిధులతో సీసీ రోడ్డు వేశారు.



పొందూరు మండలం బాణాం పంచాయతీ తానేం గ్రామ శివారులో కొత్తగా వేసిన సీసీ రోడ్డు ఇది. వాస్తవానికి, ఈ రోడ్డు వేసిన వైపు ఒక్క ఇల్లు లేదు. అలాగని మరో గ్రామం లేదు. కేవలం టీడీపీ నాయకుడి రియల్ ఎస్టేట్ వెంచర్‌కు ఉపయోగపడే విధంగా మాత్రమే రోడ్డు వేశారు. దానికోసం రూ.37లక్షలు ఖర్చు పెట్టారు.

కవిటి మండలం డి.గొనపుట్టుగలో కొత్తగా వేసిన సీసీ రోడ్డిది. ఇక్కడేమి జనసంచారం లేదు. కానీ, కొబ్బరి తోటలు ఉన్నాయి. ఆ తోటల మధ్య సీసీ రోడ్డు వేశారు. భవిష్యత్ లేఅవుట్ వేయాలన్న ఆలోచనలో భాగంగానే వ్యూహాత్మకంగా సీసీ రోడ్డు వేసినట్టు తెలుస్తోంది. రికార్డుల్లో ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి హనుమాన్ విగ్రహం వరకు అంటూ శిలాఫలకంపై రాతలు రాశారు. కానీ, సగం వరకు(కొబ్బరి తోటలకు ఉపయోగపడే విధంగా) వేసి వదిలేశారు. ఎమ్మెల్యే బెందాళం అశోక్ స్వగ్రామం పక్కనున్న పంచాయతీ ఇది.





కవిటి మండలం సీహెచ్ జల్లుపుట్టుగలో వేసి రోడ్డు ఇది. ఇక్కడ కూడా జనసంచారం లేదు. కొబ్బరి తోటలకు విలువ పెరిగేలా వాటి మధ్య వేసిన రోడ్డు ఇది. భవిష్యత్ లేఅవుట్ వేసి లబ్ధి పొందాలన్న వ్యూహాత్మక ఆలోచనలో భాగంగా ముందస్తుగా వేసిన రోడ్డుగా తెలుస్తోంది. మరిడమ్మ గుడి వరకు సీసీ రోడ్డు వేసినట్టు శిలాఫలకంలో రాసినప్పటికీ సగం వరకు మాత్రమే వేశారు.

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:



కూటమి పాలనలో దుర్మార్గపు పనులు కొట్టొచ్చినట్టు కనిపిస్తున్నాయి. ఉపాధి హామీలో భాగంగా లభించిన మెటీరియల్ కాంపోనెంట్ నిధులను చాలా వరకు టీడీపీ నాయకుల స్వప్రయోజనాలకు వాడిన దాఖలాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఉపాధి నిధులను పప్పుబెల్లాల్లా పంచేసుకుని రోడ్లు, ఇతరత్రా రూపంలో ఖర్చు చేశారు. జిల్లాలో దాదాపు రూ. 185కోట్లకు పైగా అంచనా వ్యయంతో మొదలు పెట్టిన 3942 పనుల్లో అత్యధికం నేతలకు లబ్ధి చేకూర్చే విధంగా ఉన్నాయి. నేతల పొలాలకు, లేఅవుట్‌లకు, ఇతరత్రా అవసరాల కోసం వేశారే తప్ప ప్రజాప్రయోజనాలు చూడలేదు. ఈ పనుల ద్వారా నిధుల దుర్వినియోగం తప్ప గ్రామాలకు ఉపయోగపడిందేమీ లేదు. కొన్నిచోట్ల బాగున్న రోడ్లపైనే రోడ్లు వేసి ఉపాధి నిధులను మింగేశారు. ఇప్పటికే వీటిపై పెద్ద ఎత్తున ఫిర్యాదులు వెళ్లాయి.

- ఆమదాలవలస మండలం గట్టుమూరు పేటలో టీడీపీ నాయకుడు ఇంటి వెనక ఉన్న మరుగుదొడ్డికి ప్రత్యేకంగా రోడ్డు వేశారు.
- ఆమదాలవలస మండలం వంజంగిపేటలో బాగా ఉన్న సీసీ రోడ్డుపై మళ్లీ రోడ్డు వేశారు.
- ఆమదాలవలస మండలం బొబ్బిలిపేటలో చెరువుపై సీసీ రోడ్డు మంజూరు చేశారు. ఇరిగేషన్ శాఖ అనుమతి లేకుండా రోడ్డు వేసేందుకు సిద్ధమవుతున్న సమయంలో ఫిర్యాదులు వెళ్లడంతో ఆగారు.

ఇలా చెప్పుకునిపోతే జిల్లాలో అనేకం ఉన్నాయి. ఉద్దానం ప్రాంతంలోనైతే మరింత ఎక్కువగా ఉన్నాయి. రోడ్డు పక్కనున్న కొబ్బరి తోటల్ని రియల్ ఎస్టేట్ వ్యాపారులు కోట్లరూపాయలకు కొనుగోలు చేసి ప్లాట్లుగా మార్చేస్తున్న నేపథ్యంలో అభివృద్ధి పేరుతో కొబ్బరి తోటల మధ్యలో సీసీ రోడ్లు వేసి అక్కడి భూములకు అధిక ధరలు వచ్చేలా కూటమి నాయకులు వ్యూహాత్మక ఎత్తుగడతో వ్యవహరించారన్న విమర్శలు ఉన్నాయి. కొబ్బరి తోటలకు గిరాకీ పెరగడానికి, రియల్ ఎస్టేట్ వ్యాపారులకు లాభం కలిగించడానికే తప్ప ప్రజలకు ఉపయోగపడేదేమీ లేదు.

ఫిర్యాదులు వెల్లువ

ఉపాధి హామీ పథకం మెటీరియల్ కాంపోనెంట్ కింద చేపడుతున్న పనులకు నిధులు దుర్వినియోగం తప్ప ప్రజలకు, గ్రామాలకు ఒరిగిందేమీ లేదని, అక్రమాలకు బాటలు వేశారని ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా ఫిర్యాదులు వెళ్తున్నాయి. ఆమదాలవలస నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌ఛార్జి చింతాడ రవికుమార్ ఏకంగా కలెక్టర్ గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. మరోవైపు లోకాయుక్తకు, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌కు లిఖితపూర్వకంగా పక్కా ఆధారాలతో ఫిర్యాదు చేయడానికి సిద్ధమవుతున్నారు.

బొంతలకోడూరు సర్పంచ్ చెక్ పవర్ రద్దు



పంచిరెడ్డి రాంబాబు

ఎచ్చెర్ల క్యాంపస్: స్థానిక సంస్థల స్వయం ప్రతిపత్తిని నిర్వీర్యం చేస్తూ కూటమి ప్రభుత్వం వైఎస్సార్ సీపీ సర్పంచ్‌లపై కక్ష సాధిస్తోంది. కారణం లేకుండా తప్పుడు నివేదికలతో చెక్ పవర్ రద్దు చేస్తోంది. తాజాగా బొంతలకోడూరు గ్రామ సర్పంచ్ పంచిరెడ్డి రాంబాబు చెక్ పవర్ రద్దు చేస్తూ జిల్లా పంచాయతీ అధికారి భారతీ సౌజన్య సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. గ్రామంలో కూటమి నాయకులు వ్యక్తిగత కక్షతో, ప్రజాప్రతినిధులు ఒత్తిడితో చెక్ పవర్ తొలగించారు. ఇటీవల కూటమి నాయకులు గ్రామంలోని మలిపెద్దివాని చెరువు ఆక్రమణలకు ప్రయత్నించారు. సర్పంచ్ అడ్డుకున్నారు. మరోపక్క పంచాయతీలో కూటమి నాయకులకు వేలు పెట్టే అవకాశం ఇవ్వలేదు. దీంతో వీరు చెక్ పవర్ రద్దుకు కారణాలు అన్వేషించారు.

గ్రామానికి రూ. 40 లక్షలు గ్రామ సచివాలయం భవనం మంజూరైంది. ఈ సచివాలయ భవనం కాంట్రాక్టర్‌కు అప్పగించారు. కాంట్రాక్టర్ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్మాణం ప్రారంభించారు. పాఠశాల ఆవరణలో ఇతర నిర్మాణాలు వద్దని హైకోర్టు తీర్పు మేరకు ఈ భవనం పనులు నిలిపివేశారు. ఇంజినీరింగ్ అధికారుల ఎం-బుక్ రికార్డు మేరకు కాంట్రాక్టర్‌కు పంచాయతీ నుంచి రూ.1.80 లక్షలు చెల్లించారు. ఇది సర్పంచ్ విధులు దుర్వినియోగంగా కూటమి నాయకులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. సర్పంచ్ వ్యక్తిగత దుర్వినియోగం లేదని, పనికి చెల్లింపు మాత్రమే జరిగిందని ఇంజినీరింగ్ అధికారులు సైతం నివేదిక ఇచ్చారు. పంచాయతీ అధికారులు సైతం క్షేత్రస్థాయిలో దర్యాప్తు నిర్వహించారు. రాజకీయ ఒత్తిళ్ల కారణంగా చివరికి చెక్ పవర్ రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. దీనిపై న్యాయపోరాటం చేస్తానని సర్పంచ్ తెలిపారు.

మృతదేహాలకు పోస్టుమార్టం

శ్రీకాకుళం రూరల్: మండల పరిధిలోని గూడేం గ్రామంలో వ్యవసాయ బావిలో దూకి ఆత్మహత్యలకు పాల్పడిన తల్లీకూతుళ్లు మోదు సావిత్రమ్మ, ఈదల వరలక్ష్మీ మృతదేహాలకు సోమవారం రిమ్స్ ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. విషయం తెలుసుకున్న సావిత్రమ్మ తల్లి బిలాయి నుంచి గూడేం గ్రామానికి చేరుకున్నారు. మృతదేహాలను కుటుంబ సభ్యులకు అప్పగించారు.

అసిస్టెంట్ కలెక్టర్‌గా పృథ్వీ రాజ్‌కుమార్



దొనక పృథ్వీ రాజ్‌కుమార్

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాకు అసిస్టెంట్ కలెక్టర్‌గా శిక్షణలో ఉన్న దొనక పృథ్వీ రాజ్‌కుమార్‌ను నియమితులయ్యారు. ఆయన సోమవారం బాధ్యతలు స్వీకరించారు. వచ్చే ఏడాది ఏప్రిల్ 24 వరకు ఈ పదవిలో ఉంటారు. పృథ్వీకుమార్ వయసు 23 ఏళ్లు. ఈయన 2024 బ్యాచ్ ఐఏఎస్ అధికారి. మన్యం జిల్లా పార్వతీపురానికి చెందిన పృథ్వీ తండ్రి విజయకుమార్ మండల విద్యాధికారి (ఎంఈఓ)గా, తల్లి వెంకటరత్నం గృహిణిగా ఉన్నారు. సోదరి పూజిత ఆంధ్ర విశ్వవిద్యాలయంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్నారు. పృథ్వీ ప్రాథమిక విద్య నుంచి పదో తరగతి వరకు పార్వతీపురంలోనే చదివారు. ఇంటర్ నారాయణ లో చేసి, ఉస్మానియా యూనివర్సిటీ నుంచి హిస్టరీ, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, జియాలజీ సబ్జెక్టులతో డిగ్రీ పట్టా అందుకున్నారు. అనంతరం ఇగ్నో యూనివర్సిటీ, ఢిల్లీ ద్వారా పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్‌లో పీజీ సాధించారు. తర్వాత సివిల్ సర్వీసెస్‌లోకి వచ్చారు. ప్రస్తుతం శ్రీకాకుళం జిల్లాలో పరిపాలనా వ్యవహారాల్లో అనుభవం సేకరించేందుకు శిక్షణ పొందుతున్నారు. ప్రజలకు చేరువగా ఉంటూ సేవలందించడమే తన లక్ష్యమని పృథ్వీ రాజ్ కుమార్ తెలిపారు.

గోధూళి వేళ.. నీలి మేఘమాల

గోధూళి వేళ సిక్కోలుపై నీలి మేఘమాల వచ్చి వాలింది. అన్ని వైపులా ముసురుకున్న మబ్బులతో నింగి ఇలా రంగులీనింది. పొద్దంతా ఉక్కబోతతో అల్లాడిపోయిన ప్రజలకు ఈ మబ్బులు కాసింత ఉపశమనం కలిగించాయి. - సాక్షి ఫొటోగ్రాఫర్, శ్రీకాకుళం



పొలం గొంతులో గరళం

- రాగోలు పరిసర ప్రాంతాల్లో ఆందోళనకర పరిస్థితి
- పట్టించుకోని అధికారులు

శ్రీకాకుళం రూరల్:

జిల్లా కేంద్రానికి సమీపంలోని రాగోలు ప్రధాన ఆస్పత్రి నుంచి సమీప పంట పొలాలకు మెడికల్ వ్యర్థాలతో కూడిన కలుషిత నీరు వెళ్తోంది. ఇది రైతులకు ఆందోళన కలిగిస్తోంది. ఆస్పత్రి చుట్టూ ఉన్న పంట పొలాల్లోకి ఈ నీరు చిన్నచిన్న పైపుల ద్వారా చేరుకుంటోంది. అక్కడి నుంచి ప్రధాన కాలువలో కలిసి స్థానికంగా ఉన్న కొర్లగండం చెరువులోకి చేరుకుంటోంది. ఈ చెరువు నీటిని పశువులు తాగడానికి, వాటికి స్నానాలు చేయించడానికి రైతులు వినియోగిస్తున్నారు. దీంతో పశువులకు అనేక రకాలైన వ్యాధులకు గురవుతున్నట్లు రాగోలు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.



ఆస్పత్రి నుంచి విడుదలవుతున్న కలుషితమైన మురికినీరు



కొర్లగొండం చెరువులోకి కలుస్తున్న కలుషితమైన నీరు

రీసైకిల్‌ప్లాంట్ ఏర్పాటు చేయాలి



రాగోలు జెమ్స్ నుంచి బయటకు వస్తున్న కలుషితమైన మురికినీరు బయటకు పంపకుండా ఆస్పత్రి ఆవరణంలోనే రీసైక్లింగ్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయాలి. దీంతో రీసైక్లింగ్ అయిన నీరు అక్కడే గల మొక్కలకు ఉపయోగించుకోవచ్చు. – గేదెల శంగల్బరావు, రాగోలు సర్పంచ్

యాజమాన్యానికి చెప్పాం..

కలుషిత నీరు విషయంపై ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయి. ఇదే విషయాన్ని పలు మార్లు ఆస్పత్రి యాజమాన్యానికి వివరించాం. వారి నుంచి స్పందన లేదు. – తిరుమలదేవి, పంచాయతీ సెక్రటరీ

క్లుప్తంగా

బధిరులకు టచ్ ఫోన్లు



శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన మీకోసం వినతుల స్వీకరణ కార్యాక్రమంలో విభిన్న ప్రతిభావంతుల శాఖ ద్వారా ఐదుగురు బధిరులకు టచ్ ఫోన్లను కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అందజేశారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, విభిన్న ప్రతిభావంతుల సహాయ సంచాలకులు కవిత తదితరులు ఉన్నారు.

స్వాతీసోమనాథ్‌కు ఐకాన్ అవార్డు



అవార్డు అందుకుంటున్న స్వాతీ సోమనాథ్

శ్రీకాకుళం కల్చరల్: హైదరాబాద్ రవీంద్రభారతిలో నిర్వహించిన కళాదర్బార్ గోల్డెన్ జూబ్లీ వేడుకల్లో భాగంగా సంప్రదాయ గురుకులం డైరెక్టర్ స్వాతీ సోమనాథ్ ఐకాన్ అవార్డు అందుకున్నారు. ఆదివారం జరిగిన ఈ కార్యక్రమంలో భాగంగా సంప్రదాయం బృందం సభ్యులు యామిని, బలరామ్, లోకేశ్వరి, అంజలి, లిఖిత, తేజస్వి, హేమాంజలి, హేమవల్లి, జోషిత, శ్రీజ, భవ్య, భానులు చక్కటి ప్రదర్శనతో ఆహూతులను అలరించారు.

రెండు ఆవులు మృతి



బూర్జ: మండలంలోని అన్నంపేటలో పేడాడ రంగారావుకు చెందిన రెండు పాడి ఆవులు మృతి చెందినట్లు కొల్లివలస పశువైద్యాధికారి డాక్టర్ జి.వెంకటరావు సోమవారం తెలిపారు. గ్రామంలో గుర్తు తెలియని వ్యక్తులు పశువులు తినే దాణాలో విషం కలపడం వల్ల మృతిచెందినట్లు పేర్కొన్నారు. వీటి విలువ రూ.80 వేలు వరకు ఉంటుందని చెప్పారు.

ఎమ్మెల్యే తండ్రి, సోదరుడు..

రౌడీలతో బెదిరిస్తున్నారు!

- ప్రాణహాని ఉంది.. రక్షణ కల్పించండి..
- ఎస్పీ గ్రీవెన్స్‌లో మొరపెట్టుకున్న మహిళ



ఎస్పీ కార్యాలయం బయట వినతిపత్రంతో బాధితురాలు కృష్ణవేణి, కుటుంబీకులు

శ్రీకాకుళం క్రైమ్ : తాత వారసత్వంగా వచ్చిన తమ ఆస్తిని ఎమ్మెల్యే తండ్రి, సోదరుడు ఆక్రమించుకోవడమే కాక కోర్టు ఉత్తర్వులను సైతం ధిక్కరిస్తూ అక్రమ నిర్మాణం చేపడుతున్నారని.. అడ్డుకోవాల్సిన మున్సిపాలిటీ అధికారులు రాజకీయ పలుకుబడికి తలొగ్గుతున్నారని.. ఎమ్మెల్యేతో గొడవపడొద్దు.. ఆస్తి వదిలి వెళ్లిపోండని పోలీసులు కూడా అంటున్నారని ఓ మహిళ వాపోయింది. ఈ మేరకు కొత్తూరు మండల కేంద్రానికి చెందిన లోతుగెడ్డ కృష్ణవేణి తన భర్త శ్రీరామదూతం, కుటుంబీకులతో కలిసి సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్‌కు హాజరై స్థానిక టీడీపీ ఎమ్మెల్యే గొండు శంకర్ సోదరుడు గొండు గంగాధర్, వారి తండ్రి, ఎంపీపీ గొండు జగన్నాథంలపై ఫిర్యాదు చేశారు. ఈ నెల 27న బలగ వార్డులో ఉన్న తమ ఆస్తి ఉన్న ప్రాంతానికి వెళ్తే గంగాధర్, జగన్నాథంలు రౌడీలతో వచ్చి బెదిరించి తోసేయడమే కాక మారణాయుధాలతో దాడి చేసే ప్రయత్నం చేశారని, తమ ప్రాణానికి హాని ఉన్నందున రక్షణ కల్పించాలని ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారు.

అన్యాయం చేయడం తగదు..

అనంతరం బాధితురాలు విలేకరులతో మాట్లాడారు. బలగ వార్డులో డోల సూర్యనారాయణకు ఆస్తులండేవని.. అందులో 690/1లో 86 అడుగుల పొడవు, 40 అడుగుల వెడల్పు గల స్థలాన్ని తన తల్లి కాండవ జ్యోతికి రిజిస్ట్రేషన్ చేసి తాత ఇచ్చారన్నారు. తన తల్లి జ్యోతి తాత సూర్యనారాయణ ద్వారా దాఖలు పడిన స్థలాన్ని కుమార్తెనైన తనకు ఇచ్చారని కృష్ణవేణి చెప్పారు. ఈ మేరకు 1981 మార్చి 16న రిజిస్టర్ సెటిల్‌మెంట్ దస్తావేజు నెంబరు 837/1981 దఖలు పరిచారన్నారు. ఇదే స్థలంపై తమకి ఎటువంటి రక్తసంబంధీకురాలు కాని రౌతు జయలక్ష్మి అనే మహిళ గిఫ్ట్ డీడ్ ద్వారా రిజిస్ట్రేషన్ అయ్యిందని తెరపైకి వచ్చిందన్నారు. వివాదాలు నడిచి కోర్టుకు వెళ్లగా జయలక్ష్మి పిటిషన్‌ను డిస్మిస్ చేశారన్నారు. ఇంతలో స్థలాన్ని జయలక్ష్మి తనకు విక్రయించిందని ప్రస్తుత టీడీపీ ఎమ్మెల్యే గొండు శంకర్ సోదరుడు గంగాధర్ తెరపైకి తీసుకురావడం అన్యాయని బాధితురాలు ఆవేదన వ్యక్తం చేశారు.

అధికార దుర్వినియోగానికి పాల్పడలేదు..

ఇదే విషయమై ఎమ్మెల్యే గొండు శంకర్ సోదరుడు గొండు గంగాధర్ వద్ద 'సాక్షి' ప్రస్తావించగా స్థలానికి సంబంధించిన అన్ని రకాల అనుమతులు అధికారులు ఇచ్చారని తెలిపారు. తాను ఆ స్థలాన్ని కాంగ్రెస్ సీనియర్ నేత రౌతు సీతారాంస్వామి కుమారుడి వద్ద కొనుగోలు చేశానని, దానికి సంబంధించిన పత్రాలు ఉన్నాయని చెప్పారు. తన సోదరుడి రాజకీయ ప్రోద్బలంతో ఎటువంటి అధికార దుర్వినియోగానికి పాల్పడటం లేదని స్పష్టం చేశారు.

కలెక్టర్ గ్రీవెన్స్‌కు 165 వినతులు



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్, జేసీ తదితరులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: ప్రజల ఫిర్యాదులు ఆలస్యం కాకుండా పరిష్కరించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. సోమవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో పీజీఆర్ఎస్(గ్రీవెన్స్) కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ వివిధ సమస్యలపై 165 ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి ఫిర్యాదును అత్యంత ప్రాధాన్యతతో తీసుకుని నిర్ణీత గడువులోపే పరిష్కరించాలన్నారు. ఆలస్యం చేసే వారిపై చర్యలు తప్పవన్నారు. ఫిర్యాదుల పరిష్కారంలో కొన్ని శాఖలు వెనుకబడి ఉన్నాయని.. ఆయా విభాగాల అధికారులు తీరు మార్చుకోవాలన్నారు. పరిష్కారం సాధ్యపడని ఫిర్యాదులకు స్పష్టమైన వివరణ ఇవ్వాలని చెప్పారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

సప్లిమెంటరీ పరీక్షలకు అవకాశం కల్పించాలి

- కుప్పిలి మోడల్ స్కూల్ పరీక్షా కేంద్రంలో అన్యాయంగా డీబారైన ఐదుగురు విద్యార్థులకు మే నెలలో జరిగే సప్లిమెంటరీ పరీక్షలు రాయడానికి అనుమతి మంజూరు చేయాలని ప్రజా సంఘాల ప్రతినిధులు కోరారు. ఈ మేరకు సోమవారం కలెక్టర్ గ్రీవెన్స్‌లో వినతిపత్రం అందజేశారు.
- దివ్యాంగులకు, దీర్ఘకాలిక రోగులకు పింఛను మంజూరి చేయకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని, తక్షణమే తమకు పింఛన్ మంజూరు చేయాలని ఎచ్చెర్ల మండలం తమ్మినాయుడుపేటకు చెందిన యతిరాజుల ఢిల్లేశ్వరరావు తదితరులు వినతిపత్రం అందించారు.

ఎస్పీ గ్రీవెన్స్‌కు 58 ఫిర్యాదులు

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ఎస్పీ గ్రీవెన్స్‌కు 58 ఫిర్యాదులు అందాయి. అదనపు ఎస్పీ (క్రైమ్) శ్రీనివాసరావు అర్జీదారుల నుంచి వినతులు స్వీకరించి సకాలంలో పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు.

రియల్ ఎస్టేట్ స్థలాల పేరిట మోసం..

శ్రీకాకుళం క్రైమ్ : ఎచ్చెర్ల మండలం ఎస్ఎంపురంలో స్థలాలిప్పిస్తానని చెప్పి ఓ వ్యక్తి రూ.8 లక్షలకు టోకరా వేశాడని శ్రీకాకుళం రూరల్ మండలం చాపురం-1 పంచాయతీ గోవిందపురానికి చెందిన వృద్ధుడు మట్ట సూర్యనారాయణ సోమవారం ఎస్పీ గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. ఈయన టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అటెండర్‌గా పనిచేసి రిటైరయ్యారు. అక్కడ తనతోనే పనిచేసిన శ్రీను అనే వ్యక్తికి వజ్రపుకొత్తూరు మండలం మంచినీళ్లపేటకు చెందిన పరిమళ్ల తిరుపతిరావు స్నేహితుడని, అతను పీఎస్ఆర్ రియల్ ఎస్టేట్ ప్రతినిధిగా ఉన్నారని, ఎచ్చెర్ల మండలం ఎస్ఎంపురం పంచాయతీ కనిమెట్ట గ్రామంలో 'పీఎస్ఆర్ లేఅవుట్ వెంచర్'లో స్థలం కోసం రూ.8 లక్షలు చెక్కుల రూపంలో చెల్లించామని, నాలుగైదేళ్లు కావస్తున్నా స్థలం ఇవ్వక వేధిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నాడు.

వైఎస్సార్ టీఏ అధ్యక్ష, కార్యదర్శుల నియామకం



కె.తేజేశ్వరరావు



ఎన్.గోవిందరావు

శ్రీకాకుళం అర్బన్: ఆంధ్రప్రదేశ్ వైఎస్సార్ టీచర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షునిగా కె.తేజేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా ఎన్.గోవిందరావులను నియమించారు. ఈ మేరకు సోమవారం ఏపీ వైఎస్సార్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పి.అశోక్‌కుమార్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి జి.సుధీర్‌లు ఉత్తర్వులు వెలువరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యారంగ, ఉపాధ్యాయుల సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తామని పేర్కొన్నారు.

బోధనోపకరణాల కిట్లు పంపిణీ



కిట్లను పంపిణీ చేస్తున్న అధికారులు

శ్రీకాకుళం అర్బన్: కొత్తూరు, పాతపట్నం, మెళియాపుట్టి, సారవకోట, పొందూరు, సంతబొమ్మాళి మండలాల్లోని షెడ్యూల్డ్ తెగలకు చెందిన బుద్ధిమాంద్యం గల విద్యార్థులకు బోధనోపకరణాలతో కూడిన కిట్లను డీఈఓ ఎస్.తిరుమల చైతన్య, సమగ్ర శిక్షా అడిషనల్ ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్ శశిభూషణ్ సమవారం అందజేశారు. జిల్లా కేంద్రంలోని సమగ్ర శిక్షా కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో డీఈఓ మాట్లాడుతూ సుమారు రూ.12000 విలువైన ఒక్కో కిట్లో ఆసక్తికరమైన, ఆకర్షణీయమైన, సులభతరమైన అభ్యసనకు దోహదం చేసే పరికరాలు ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సీఆర్సీ (కాంపోజిట్ రీజినల్ సెంటర్) నెల్లూరు ద్వారా వీటిని సరఫరా చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సహిత విద్యా సమన్వయకర్త బుడుమూరు గోవిందరావు, అసిస్టెంట్ కో-ఆర్డినేటర్ వి.ఉమ, నెల్లూరు ప్రతినిధి ధర్మేంద్ర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిపై గొడ్డలితో దాడి



గాయపడిన సంతోష్‌కుమార్

సంతబొమ్మాళి: మండలంలోని నౌపడ గ్రామానికి చెందిన దుక్క సంతోష్‌కుమార్‌పై అదే గ్రామానికి చెందిన జీరు శంకర్ రెడ్డి సోమవారం రాత్రి గొడ్డలితో దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. దుక్క రమేష్ అనే వ్యక్తి స్నానం చేస్తుండగా ఆ నీరు జీరు శంకర్‌రెడ్డి ఇంటి ముందునుంచి వెళ్తుండటంతో గొడవ మొదలైంది. ఇద్దరి మధ్య వాగ్వాదం జరుగుతున్న సమయంలో రమేష్ అన్న కుమారుడు సంతోష్‌కుమార్ నచ్చజెప్పే ప్రయత్నం చేశాడు. మద్యం మత్తులో ఉన్న శంకర్ రెడ్డి తన ఇంట్లో ఉన్న గొడ్డలిని తీసుకువచ్చి సంతోష్ కుమార్ తలపై దాడిచేశాడు. గాయపడిన సంతోష్‌కుమార్‌ను నౌపడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించి ప్రథమ చికిత్స చేయించి మెరుగైన చికిత్స కోసం టెక్కలి జిల్లా ఆస్పత్రికి రిఫర్ చేశారు. నౌపడ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

శివానీ ఇంజినీరింగ్ కళాశాలకు అటానమస్ హోదా



ధ్రువీకరణ పత్రాలను ప్రదర్శిస్తున్న మేనేజ్‌మెంట్ సభ్యులు

ఎచ్చెర్ల క్యాంపస్: చిలకపాలేంలోని శ్రీ శివానీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్‌కు యూనివర్సిటీ ఆఫ్ గ్రాంట్స్ కమిషన్ అటానమస్ హోదా మంజూరు చేసిందని కళాశాల యాజమాన్య ప్రతినిధులు వెల్లడించారు. ఎచ్చెర్లలో సోమవారం వారు విలేకరులతో మాట్లాడుతూ 2025-26 విద్యా సంవత్సరం నుంచి అటానమస్ అమల్లోకి వస్తుందని చెప్పారు. యూజీసీ బృందం ఫిబ్రవరి 16న కళాశాల సందర్శించి ఈ నెల 24న అటానమస్ హోదా ప్రకటించిందని తెలిపారు. నాక్, ఎన్‌బీఏ, జేఎన్‌టీయూ శాశ్వత గుర్తింపు వంటి ఆధారంగా అటానమస్ హోదా లభించిందని వివరించారు. ఇంజినీరింగ్ కాలేజ్‌లో ఆరు ఇంజినీరింగ్ బ్రాంచ్‌లు, ఎంటెక్ కోర్సులు, ఎంబీఏ కోర్సు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. భవిష్యత్తులో కరిక్యులమ్, సిలబస్‌లో మార్పులు, మెరుగైన ప్లేస్‌మెంట్‌లు లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. 80 శాతం కామన్ కోర్ సిలబస్, స్థానిక అవసరాలకు అనుగుణంగా 20 శాతం బీఓఎస్ ద్వారా మార్పు చేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మేనేజ్‌మెంట్ సభ్యులు డాక్టర్ సనపల శ్రీనివాసరావు, దుప్పల వెంకటరావు, పి.దుర్గాప్రసాద్‌రావు, కె.దుర్గా శ్రీనివాస్, ఎంఎం సాయినాథ్ రెడ్డి, హరీష్, ప్రిన్సిపాల్ డాక్టర్ వై.శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపాల్ జి.టి.చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వలస కూలీ అనుమానాస్పద మృతి





వ్యాన్‌లో మృతదేహంపై టార్పాలిన్ కప్పిన దృశ్యం (ఇన్‌సెట్లో) జోగారావు(ఫైల్)

టెక్కలి రూరల్: టెక్కలి మండలం అక్కవరం గ్రామానికి చెందిన నెయ్యిల జోగారావు(45) అనే వలస కూలీ విశాఖపట్నం జిల్లా ఆనందపురంలో అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. జోగారావు జీవనోపాధి కోసం ఇటీవల ఆనందపురంలోని రైస్ మిల్లులో డ్రైవర్‌గా జాయినయ్యాడు. రెండు రోజుల క్రితం మిల్లు నిర్వాహకులు ఫోన్ చేసి జోగారావు నిత్యం మందు తాగుతున్నాడని, పనికి సైతం సరిగా రావడం లేదని భార్యకు విషయం తెలియజేశారు. ఇంతలో సోమవారం ఉదయం టాటా మ్యాజిక్ వ్యాన్‌లో ఐదుగురు కలాసీలు జోగారావు మృతదేహాన్ని తీసుకొచ్చారు. దీంతో భార్య, గ్రామస్తులు నిర్ఘాంతపోయారు. మృతిపై తమకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండా, ఇలా ఇంటికి తీసుకురావడం వెనుక ఏదో కుట్ర ఉందంటూ టెక్కలి పోలీసులను ఆశ్రయించారు. అయితే ముందుగా పోలీసులు తమకు సంబంధం లేదని, ఏదైనా ఉంటే విశాఖ పోలీసులతో మాట్లాడుకోవాలని చెప్పారు. చివరకు జీరో ఎఫ్ఐఆర్ వేసి కేసు నమోదు చేశారు. అనంతరం మృతదేహాన్ని శవపంచనామా నిమిత్తం టెక్కలి జిల్లా ఆసుపత్రికి తరలించారు. జోగారావుకు భార్య నీలవేణి, ఇద్దరు కుమారులు ఉన్నారు.

సీఎం మెప్పు కోసం సీఐటీయూను విమర్శిస్తారా?



సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): సీఎం చంద్రబాబునాయుడు వద్ద గొప్పలు, మెప్పు కోసం ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు సీఐటీయూపై అక్కసు వెళ్లగక్కడం సరికాదని సీఐటీయూ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సీహెచ్.అమ్మన్నాయుడు, పి.తేజేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షులు కె.నాగమణి మండిపడ్డారు. జిల్లా కేంద్రంలోని సంఘ కార్యాలయంలో సోమవారం వారు విలేకరులతో మాట్లాడుతూ కార్మిక సంఘాలను, సీఐటీయూను కంట్రోల్ చేస్తున్నానని సీఎం ముందు ఎన్ఈఆర్ ప్రసంగించారని, కార్మికోద్యమాలను అడ్డుకోవడం ఎవరి తరం కాదని స్పష్టం చేశారు. ఇటువంటి ప్రగల్భాలు పలికిన వారు అనేకమంది కాలగర్భంలో కలిసిపోయారని గుర్తు చేశారు. జిల్లాలో ట్రేడ్ యూనియన్లు చేసిన పోరాటాల ఫలితం ఏ పరిశ్రమ కుంటుపడలేదని, ప్రభుత్వ విధానాల వల్లేనని తెలుసుకోవాలన్నారు. సీఐటీయూ నాయకులు ఎవరూ పరిశ్రమల్లో కాంట్రాక్టులు తీసుకోవడం లేదని, యాజమాన్యాలకు వ్యతిరేకంగా ఫిర్యాదులు చేసి, యాజమాన్యాలను బెదిరించి కాంట్రాక్టులు తీసుకుంటున్న వారెవరో ప్రజలకు తెలుసునన్నారు. పారిశ్రామిక ప్రాంతంలో అనేక పరిశ్రమల్లో కార్మికులు గాయపడుతున్నా, చనిపోతున్నా యాజమాన్యాలపై నోరెత్తని ఎమ్మెల్యే.. కార్మికుల సమస్యలపై పోరాటాలు చేసే సీఐటీయూపై అనుచితంగా మాట్లాడటం శోచనీయమన్నారు. ఎచ్చెర్ల నియోజకవర్గంలో కార్మికుల ఓట్లతో గెలిచి కార్మిక వ్యతిరేక వైఖరిని అవలంబించడం తగదన్నారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం కార్మిక హక్కులు కాలరాస్తోందని దుయ్యబట్టారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు ఎం.ఆదినారాయణమూర్తి, ఎస్.వి.రమణ, అల్లు.సత్యన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఎంఎల్‌హెచ్‌ఓల సమ్మెబాట

శ్రీకాకుళం పాతబస్టాండ్: ప్రభుత్వం మిడ్ లెవెల్ హెల్త్ ఆఫీసర్ల(ఎంఎల్‌హెచ్‌ఓ)ల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని, ఇప్పటికే పలుమార్లు వినతిపత్రాలు, నిరసనల ద్వారా తెలియజేసినా పరిష్కరించకపోవడంతో ఈ నెల 28 నుంచి సమ్మెబాట పడుతున్నట్లు సంబంధిత అధికారులు తెలిపారు. సోమవారం కలెక్టరేట్ సమీపంలోని జ్యోతీరావు పూలే పార్కులో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత నెల 15 నుంచి చేస్తున్న నిరసన కార్యక్రమాలు చేపడుతున్నా ప్రభుత్వం స్పందించకపోతో ఏప్రిల్ 28 నుంచి నిరవధిక సమ్మె చేయాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు నిరంజన్, ప్రధాన కార్యదర్శి బి.సందీప్‌కుమార్, వినోద్‌కుమార్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలియజేస్తున్న మిడ్ లెవెల్ హెల్త్ అధికారులు

పట్టుబట్టి.. పూర్తి చేసి..

- తిరుమలలో అవమానం జరిగిందంటూ ఆలయ నిర్మాణానికి పూనుకున్న 83 ఏళ్ల వృద్ధుడు
- ఎట్టకేలకు నిర్మాణ పనులు పూర్తి
- ప్రతిష్టాపనోత్సవాలు ప్రారంభం



కాశీబుగ్గలో నిర్మించిన వెంకన్న గుడి

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గకు చెందిన హరిముకుందపండా అనే వ్యక్తి కలియుగ దైవం వేంకటేశ్వర స్వామిని దర్శించుకునేందుకు తిరుమల వెళ్లగా అక్కడ దర్శన సమయంలో అవమానం జరిగిందని భావించి ఏకంగా రూ.పది కోట్లతో 12 ఎకరాల విస్తీర్ణంలో వెంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి పూనుకున్న సంగతి తెలిసిందే. ఎట్టకేలకు ఆలయ నిర్మాణం పూర్తికావడంతో సోమవారం నుంచి ప్రతిష్టాపనోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఎవరి నుంచి చందాలు వసూలు చేయకుండా, ఏ ఇంజినీర్ల సలహాలు, సూచనలు లేకుండా 83 ఏళ్ల వయసులో హరి ముకుందపండా స్వీయ పర్యవేక్షణలో కోవెల పనులు పూర్తి చేయడం విశేషం. మూడు రోజులు పాటు ప్రతిష్టామహోత్సవాలు, సహస్ర చండీ మహాయజ్ఞం జరగనున్నాయి.


డీసీఎంఎస్ చైర్మన్‌గా అవినాష్



చౌదరి అవినాష్

ఎచ్చెర్ల క్యాంపస్: శ్రీకాకుళం డీసీఎంఎస్ చైర్మన్‌గా ఎస్ఎంపురం మాజీ సర్పంచ్ చౌదరి అవినాష్‌ను నియమిస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈయన గతంలో ఎస్ఎంపురం సర్పంచ్‌గా వ్యవహరించారు. తల్లి చౌదరి ధనలక్ష్మి జెడ్పీ చైర్‌పర్సన్‌గా పనిచేశారు. తండ్రి నారాయణమూర్తి (బాబ్జి) గతంలో జిల్లా టీడీపీ అధ్యక్షునిగా, జిల్లా పరిషత్ వైస్ చైర్మన్‌గా పనిచేశారు.

డీసీసీబీ చైర్మన్‌గా శివ్వాల



సూర్యనారాయణ

సరుబుజ్జిలి: డీసీసీబీ చైర్మన్‌గా సరుబుజ్జిలి మండలం షళంత్రి గ్రామానికి చెందిన శివ్వాల సూర్యనారాయణను నియమిస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం ఈయన టీడీపీ రాష్ట్ర కార్యదర్శిగా పనిచేస్తున్నారు. గతంలో జెడ్పీటీసీ, సర్పంచ్‌గా, ప్రస్తుతం షళంత్రి ఎంపీటీసీ సభ్యునిగా వ్యవహరిస్తున్నారు. ఈయన భార్య శివ్వాల కృష్ణవేణి గతంలో జెడ్పీటీసీగా పనిచేశారు.